క్లుప్తంగా

పెద్దాస్పత్రిలో తనిఖీలు



ఓపీల వద్ద తనిఖీలు చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారిగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి బుధవారం వివిధ వార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనరల్ ఓపీ, ఆర్థో ఓపీ, ఎస్సార్సీ సెంటర్, ఏఆర్టీ క్లినిక్ తదితర విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యం, వసతుల గురించి ఆరా తీశారు. మెరుగైన వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ కళారాణి, డాక్టర్ సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన గ్రూపులను ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(పొగతోట) : స్వయం సహాయక గ్రూపులను బలోపేతం చేసి నూతన గ్రూపులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. డీఆర్డీఏ సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య ఈసీ మీటింగ్‌లో బుధవారం ఆమె పాల్గొని, మాట్లాడారు. మండలాల్లో క్రమం తప్పకుండా ఈసీ సమావేశాలు నిర్వహించాలన్నారు. తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేలా మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా సమాఖ్య సభ్యులు, వివిధ మండలాల సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

అందుబాటులోకి తీసుకొస్తాం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారిణి వెంకటలక్ష్మమ్మ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఎస్సార్ శంకరన్ రిసోర్స్ సెంటర్లను వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి వెంకటలక్ష్మమ్మ అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లోని విద్యార్థులను మెనూ ప్రకారం భోజన సదుపాయం కల్పించాలన్నారు. వసతి గృహ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

నిబంధనలను విధిగా పాటించాలి



ఆత్మకూరు బస్టాండ్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్) : డ్రైవర్లు విధిగా రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని పోలీసు అధికారులు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మితిమీరిన వేగం, మద్యం మత్తు, సెల్‌ఫోన్ డ్రైవింగ్, పరిమితికి మించిన ప్రయాణం చేయడం ప్రమాదకరమన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో నగర ఇన్‌స్పెక్టర్లు కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, రోశయ్య, శ్రీనివాసులురెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.

మహిళల సంరక్షణే ధ్యేయం

నెల్లూరు(అర్బన్) : సమాజంలోని మహిళలు, బాల, బాలికల హక్కులను కాపాడుతూ వారి సంరక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు అన్నారు. ఎస్పీ ఆదేశాలతో బుధవారం నగరంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 'మహిళల హక్కులు.. రక్షణ' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐలు కృష్ణారెడ్డి, సుబ్బారావు, ఎస్సై భాస్కర్, నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వసుంధరాదేవి పాల్గొన్నారు.

ఒత్తిడిని దూరం చేసుకోవాలి

నెల్లూరు(అర్బన్) : ఒత్తిడిని దూరం చేయడం ద్వారా మానసిక రోగాలు, బీపీ లాంటి సమస్యల నుంచి బయటపడవచ్చని న్యూరాలజిస్ట్ డాక్టర్ హేమలత అన్నారు. నగరంలోని హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ కార్యాలయంలో వృద్ధులను ఆదరిద్దాం.. ఒత్తిడిని ఎదుర్కొందాం.. ప్రశాంతంగా జీవిద్దాం అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ యోగా, ధ్యానం, పుస్తకాలు చదవడం, కుటుంబసభ్యులతో గడపడం, పౌష్టికాహారం తీసుకోవడం వంటివి చేయాలన్నారు. ఎ.జయప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ గోవిందయ్య, నిర్వాహకులు శ్యామ్, రమేష్ పాల్గొన్నారు.

నగరం.. గుంతలమయం



పొట్టెపాళెం ప్రధాన రహదారిపై అడుగడుగునా ఏర్పడిన గుంతలు



వాహనదారుల అవస్థలు



బుజబుజ నెల్లూరు వద్ద హైవేపై దెబ్బతిన్న రోడ్డు



దెబ్బతిన్న రోడ్డుపై వాహనదారుల అవస్థలు

నెల్లూరు నగరం గుంతలమయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు మొదలుకుని, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు, జాతీయ రహదారిలో ఏర్పడిన గుంతలు వాహనదారులను నిత్యం భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. నగరంలోని పొట్టెపాళేనికి వెళ్లే రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఉన్నాయి. జొన్నవాడకు వెళ్లే ప్రజలతో పాటు నరసింహకొండకు వెళ్లే భక్తులు ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతల వల్ల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. దీనిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతే కాకుండా నగరం గుండా వెళ్లే కలకత్తా–చెన్నై జాతీయ రహదారిపై పలుచోట్ల రోడ్డు దెబ్బతింది. దీనివల్ల వేగంగా వచ్చే ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

26 నుంచి వెటరన్స్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 26, 27వ తేదీల్లో వెటరన్స్ డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెలక్షన్స్ జరుగుతాయని రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో 35, 40, 45, 50, 55, 60, 65, 70, 75 వయస్సులకు సంబంధించి మెన్స్ సింగిల్స్, ఉమెన్స్ సింగిల్స్, మెన్స్ డబుల్, ఉమెన్స్ డబుల్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 25 సాయంత్రం 5 గంటల్లోపు తమ పేరును ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జనన ధ్రువీకరణ పత్రంతో సహా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కోచ్ వెంకటేష్ 94944 92717 నంబర్‌ను సంప్రదించగలరు.

డ్రైయిన్ పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ : 35వ డివిజన్ నీలగిరి సంఘంలో రూ.38 లక్షలతో సీసీ డ్రైయిన్ పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలగిరి సంఘంలో డ్రైయినేజీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

కాకాణితో పలువురు నేతల భేటీ



కాకాణితో పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పలువురు నేతలు భేటీ అయ్యారు. నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న కాకాణి క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, కోవూరు ఇన్‌చార్జి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ, నగర ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతంపై చర్చించారు. కొడవలూరు మండలంలో పలువురు సర్పంచులకు చెక్ పవర్ రద్దుపై వారు కాకాణి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ చెక్‌పవర్ రద్దుపై న్యాయ పోరాటం చేస్తామని, పోలీసు కేసులకు భయపడమని స్పష్టం చేశారు.

మానవ మనుగడకు చెట్లు కీలకం



మొక్కలు నాటుతున్న క్లబ్ సభ్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : మానవ మనుగడకు చెట్లు ఎంతో కీలకమని శ్రీపొట్టిశ్రీరాములు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సింగంశెట్టి మురళీమోహన్‌రావు, జి.సుబ్రహ్మణ్యం తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో, నగర శివారులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావితరాల రక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి ఎన్.హరినాథ్‌రెడ్డి, గౌరవ సలహాదారు వై.రవి, గౌరవాధ్యక్షుడు పప్పు నారాయణ, సహాయ కార్యదర్శి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు



శ్రీనివాసరెడ్డిని సత్కరించిన రెడ్ల ఐక్యవేదిక ప్రతినిధులు

నెల్లూరు(బృందావనం) : నగర డీఎస్పీగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న డి.శ్రీనివాసరెడ్డిని రెడ్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. నగరంలోని శాంతినగర్‌లో ఉన్న రెడ్ల ఐక్య వేదిక కార్యాలయంలో బుధవారం శ్రీనివాసరెడ్డికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్ష, కార్యదర్శులు నిర్మల నరసింహారెడ్డి, డాక్టర్ బీవీ రెడ్డి మాట్లాడుతూ నగర డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి శ్రీనివాసరెడ్డి ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలందించారన్నారు. బదిలీపై వెళ్తున్న అయన్ను సముచితంగా సత్కరించామన్నారు. కార్యక్రమంలో రెడ్ల ఐక్యవేదిక సభ్యులు డాక్టర్ వెందోటి ధనుంజయరెడ్డి, జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, గుండాల ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ విజయకుమార్‌యాదవ్

నెల్లూరు సిటీ : రూరల్ పరిధిలోని 18 పంచాయతీల్లో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ బి.విజయకుమార్‌యాదవ్, ఎంపీడీఓ శైలేంద్రకుమార్ అన్నారు. రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వాతావరణం శీతలంగా ఉండడం వల్ల పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామాల్లో ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలని కోరారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా సర్పంచ్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా దోమల నివారణకు పంచాయతీల్లో ఫాగింగ్ మెషీన్లను వినియోగించాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దేవసేనమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు మీరా మొహిద్దీన్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

> **అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్నారు**
> సొసైటీల ద్వారా రైతులకు అధిక ధరలకు యూరియా బస్తాలను విక్రయిస్తున్నారు. వ్యవసాయాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.
> – కందమూరు ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి

వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు పొందాలి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : కార్పొరేషన్ పరిధిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలు చేసుకునే వారు ట్రేడ్ లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. ఎన్ఎంసీ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమర్షియల్ ట్రేడ్ లైసెన్స్‌లను గుర్తించి, నోటీసులు జారీ చేసి ఫిబ్రవరిలోపు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త తరలింపు వాహనాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత వెహికల్ ఇన్‌చార్జి డీఈ రఘురామ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, శానిటరీ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ మంత్రి మొద్దునిద్ర వీడాలి

- వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు మల్లి నిర్మల

నెల్లూరు(బారకాసు) : నగరంలో దోమల తీవ్రత వల్ల ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి మాత్రం మొద్దు నిద్రలో ఉన్నారని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు మల్లి నిర్మల అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు స్పందించకపోవడం తగదన్నారు. పేద ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధ లేదన్నారు. ఇలాగే కొనసాగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజల పక్షాన అధికార పార్టీని నిలదీస్తామని చెప్పారు. ప్రజలు జ్వరాలతో వైద్యశాలకు పరుగులు తీస్తున్నారని, ఇకనైనా మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, అధికారులు మొద్దు నిద్ర విడనాడి ప్రజల క్షేమం కోసం పనిచేయాలన్నారు. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పీహెచ్‌సీకి ఉపకరణాల వితరణ

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పలు ఉపకరణాలను బుధవారం అందజేశారు. సుమారు రూ.2 లక్షల విలువైన పరికరాలను అందించారు. ఎస్‌బీఐ అల్లీపురం శాఖ మేనేజర్ కొండమ్మ, వైద్యులు బలరామనాయక్, హజరత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైమ్) : ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మన్సూర్ నగర్‌కు చెందిన లీలావతి, శేఖర్ 2016లో కులాంతర వివాహం చేసుకున్నారు. అయితే దీనిపై శేఖర్ ఇంట్లో ఇష్టం లేదు. తరచూ వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే అదనుగా శేఖర్ సామాజిక వర్గానికి చెందిన నటరాజ్, మల్లిక, మరికొందరు లీలావతిని కులం పేరుతో దూషించసాగారు. ఈనెల 15న మల్లిక, లక్ష్మి, దుర్గ, ధన, వాణిలు ఆమె ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించారు. లీలావతి, శేఖర్‌లపై దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితురాలు బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే ముగ్గు విషయంలో తనపై, తన కుమార్తెలపై లీలావతి, ఆమె భర్త దాడి చేశారని మల్లిక ఫిర్యాదు చేశారు. ఇరు ఫిర్యాదులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరాశ్రయులకు ఆహారం అందించండి

- కమిషనర్ సూర్యతేజ



పాత మున్సిపల్ కార్యాలయంలోని శరణార్థుల కేంద్రంలో పలు సూచనలు చేస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు) : పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శరణార్థుల శిబిరంలో నిరాశ్రయులకు అన్న క్యాంటీన్ల నుంచి ఆహారాన్ని అందించాలని, అలాగే భవన మరమ్మతులను వెంటనే చేయించాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా శరణార్థుల శిబిరాన్ని కమిషనర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో ఉన్న వారికి సబ్బు, కాస్మొటిక్స్, దుప్పట్లు, కొత్త దుస్తులు అందించాలని సూచించారు. జాతీయ పట్టణ జీవనోపాధుల పథకం ఏఆర్‌డీపీడీ నిర్వహణలోని నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రం, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిరోజు 50 మంది నిరాశ్రయులకు అన్న క్యాంటీన్ల ద్వారా ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక అన్న క్యాంటీన్‌ను కమిషనర్ సందర్శించి ప్రజలకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం సమీపంలోని వీధి శునకాల జనన నియంత్రణ కేంద్రాన్ని సందర్శించి వెటర్నరీ వైద్యుడితో మాట్లాడారు. శస్త్రచికిత్సలకు సంబంధించి వివరాల నమోదును పరిశీలించి తగిన సూచనలు చేశారు. స్థానిక బాలాజీనగర్ బాజీతోట ప్రాంతంలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నేర్చుకుంటున్న కర్రసాము ప్రదర్శనను కమిషనర్ వీక్షించి అభినందించారు. 15వ డివిజన్‌లోని 1, 2, 3 సచివాలయాలను సందర్శించారు. అక్కడున్న పలు రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో ఆస్తి, తాగునీటి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లను వేగవంతం చేసి వందశాతం లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. డ్రైయిన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత, పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణను ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మదన్‌మోహన్‌తో పాటు రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ రోగులకు నాణ్యమైన వైద్యం

- ఏపీ శాక్స్ ఏపీడీ డాక్టర్ సరస్వతీదేవి



ఏఆర్‌టీ సెంటర్‌లో డాక్టర్లతో మాట్లాడుతున్న ఏపీ శాక్స్ ఏపీడీ సరస్వతీదేవి, డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు (అర్బన్): రాష్ట్రంలోని అన్ని ఏఆర్‌టీ సెంటర్లలో హెచ్‌ఐవీ రోగులకు నాణ్యమైన వైద్య సేవలందేలా చర్యలు చేపట్టామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ సరస్వతీదేవి తెలిపారు. బుధవారం ఆమె నెల్లూరు సర్వజన ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వసతులను, మందుల నిల్వల పరిస్థితిపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు డాక్టర్లు అందిస్తున్న వైద్య సేవలు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ రోగులకు ఖరీదైన మందులను ప్రతి నెలా ఉచితంగా ఇస్తున్నామన్నారు. రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ ఏఆర్‌టీ సెంటర్లలో చికిత్స పొందాలన్నారు. హెచ్‌ఐవీ రోగులకు మెరుగైన ఆరోగ్యం కోసం నెల్లూరులో విహాన్, వైఆర్‌జీ, కేర్ ఇండియా వంటి 7 స్వచ్ఛంద సంస్థలు పని చేస్తున్నాయన్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలున్న హెచ్‌ఐవీ రోగులను ఎక్స్‌పర్ట్ కమిటీ ద్వారా హైయ్యర్ సెంటర్‌కు పంపించి వైద్య సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, ఏఆర్‌టీ సెంటర్ డాక్టర్లు రామకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రికి సీటీజీ యంత్రాలు

నెల్లూరు(అర్బన్) : తల్లి గర్భంలోని పిండం గుండె పనితీరును తెలుసుకునేందుకు (ఫీటల్ హార్ట్ ఫంక్షనింగ్) అవసరమైన కంటిన్యూయస్ కార్డియో టోకో గ్రఫీ(సీటీజీ) యంత్రాలు ఆరు బుధవారం పెద్దాస్పత్రికి చేరుకున్నాయి. వీటిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు ఇక్కడకు పంపించారు. వీటిని స్టోర్ రూమ్‌లో భద్రపరిచారు. పెద్దాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర పాల్గొన్నారు.

వేదగిరిలో విశేష పూజలు

నెల్లూరు సిటీ : రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత మూలవిరాట్‌కు స్నపన తిరుమంజనం, తిరుప్పావడ సేవలు జరిపారు. ఉభయకర్తలుగా మాలేపాటి సుబ్బారాయుడు, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అర్చకుడు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల ప్రచారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద సీపీఎం నేతలు బుధవారం ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మన్నూరు భాస్కరయ్య, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

అమిత్‌షా రాజీనామా చేయాలని నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు అయన బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ పాల్గొన్నారు.